TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 47 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ గురువారం | మే 28, 2026

## పూర్తి కావచ్చిన కాజీపేట రైళ్ల తయారీ యూనిట్

- ఇక్కడే ఇంటర్ సిటీ రైళ్ల తయారీ
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్




**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణలోని ప్రతిష్టాత్మక కాజీపేట రైళ్ల తయారీ యూనిట్ (కోచ్ ఫ్యాక్టరీ) పనులు పూర్తి కావచ్చాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. త్వరలోనే ఈ యూనిట్‌లో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రక్రియ ప్రారంభం కానుందని ఆయన స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో కాజీపేట రైల్వే తయారీ యూనిట్ పురోగతిపై మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఐదేళ్ల కాలంలో కాజీపేట యూనిట్ నుండి ఏకంగా 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ రైళ్లను దేశవ్యాప్తంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య ప్రయాణాల కోసం వినియోగిస్తామన్నారు. కొత్తగా అందుబాటులోకి రానున్న ఈ ఇంటర్ సిటీ రైళ్లు అత్యాధునిక హంగులతో రూపొందుతున్నాయని రైల్వే మంత్రి తెలిపారు.




## దేశానికే ఆదర్శంగా ‘ఫ్యూచర్ సిటీ’

- స్కిల్ యూనివర్సిటీ, ఎఫ్‌సీడీఏ భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా అత్యాధునిక హంగులతో నిర్మాణం
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- పొంగులేటి, శ్రీధర్ బాబు ఆదేశం

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ‘ఫ్యూచర్ సిటీ’ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీ పరిధిలో శరవేగంగా నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనంతో పాటు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులను మంత్రులు క్షేత్రస్థాయిలో అకస్మాత్తుగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, వేగం పెంచాలని ఆదేశించారు.

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :

## ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

- మంత్రి పొంగులేటి ఛాలెంజ్‌పై కేటీఆర్ ప్రతిసవాల్
- డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిన ఘనత మాది
- రెండున్నరేళ్లలో నగరంలో కట్టినవి ఎన్ని? పడగొట్టినవి ఎన్ని?
- శ్వేతపత్రం విడుదల చేయాలి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజకీయ సవాళ్లు విసరడం, ఆ తర్వాత వెనక్కి తగ్గి పారిపోవడం కాంగ్రెస్



నాయకులకు మొదటి నుంచి అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తీవ్రంగా విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ ఓట్లు అడగదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదంటూ ఇటీవల మంత్రి పొంగులేటి విసిరిన సవాల్‌పై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “మాది ప్రజల ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ. పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించడమే కాకుండా.. పేదల స్వగృహ స్వప్నాలను సాకారం చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే” అని స్పష్టం చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల వలే తాము పేదలకు ‘డబ్బా ఇళ్లు’ కట్టించలేదని, అన్ని హంగులతో ‘డబుల్ బెడ్‌రూం ఇళ్లను’ నిర్మించి ఇచ్చామని పేర్కొన్నారు. (వివరాలు 2వ పేజీలో..)



## తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

### నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దివంగత మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, నటసార్వభౌమ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు గురువారం రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఘనంగా జరిగాయి. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ సమీపంలోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద తెల్లవారుజాము నుంచే అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సినీ ప్రముఖులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆయనకు వినమ్రంగా నివాళులర్పించారు. ప్రముఖ కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలోనే ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకున్నారు. తాతగారి సమాధిపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జూనియర్ ఎన్టీఆర్ రాకతో అక్కడ ఒక్కసారిగా అభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. తెల్లవారుజాము నుంచే భారీగా వేచి ఉన్న అభిమానులు తమ ప్రియతమ నటుడిని చూసేందుకు పోటీ పడ్డారు. ‘జై ఎన్టీఆర్.. జోహార్ ఎన్టీఆర్’ అంటూ అభిమానులు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

- రాజకీయ లబ్ధి కోసమే కావాలని యాగి చేస్తున్న నేతలు
- చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం
- సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమది ముమ్మాటికీ రైతు పక్షపాత ప్రభుత్వమని, రాష్ట్రంలోని రైతులు పండించిన చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నలమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుత సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8,575 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సజావుగా కొనుగోళ్లు జరుపుతుంటే, ప్రతిపక్షాలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే ధాన్యం కొనుగోళ్లపై బురదజల్లుతూ రాద్ధాంతం చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు



కలగకుండా చూస్తున్నామని చెప్పారు. అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడిన పరిస్థితులపై మంత్రి ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. (వివరాలు 2వ పేజీలో..)

## పూర్తి కావచ్చిన కాజీపేట రైల్ల తయారీ యూనిట్

- ఇక్కడే ఇంటర్ సిటీ రైళ్ల తయారీ
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

(మొదటి పేజీ తర్వాత..) ఈ రైళ్లలో ప్రయాణికుల రక్షణ కోసం ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి రైలులోనూ సురక్షితమైన కోచ్ డిజైన్‌తో కూడిన 20 ఆధునిక కోచ్‌లు ఉంటాయి. ప్రయాణికులకు ప్రయాణం మరింత సుఖవంతం చేసేందుకు అన్ని రకాల అధునాతన వసతులను ఇందులో అమర్చుతున్నారు. కాజీపేటలో తయారయ్యే ఈ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించేలా ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ రైళ్లలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'రీజనరేటివ్ బ్రేకింగ్' పరిజ్ఞానాన్ని వాడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సాంకేతికత ద్వారా రైలుకు బ్రేకులు వేసిన ప్రతిసారీ అది ఒక విద్యుత్ జనరేటర్‌గా మారుతుంది. అలా బ్రేకింగ్ సమయంలో పునరుత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను తిరిగి మెయిన్ గ్రిడ్‌లోకి పంపేలా ఈ అధునాతన వ్యవస్థ పనిచేస్తుందని, దీనివల్ల భారీగా ఇంధనం, విద్యుత్ ఆదా అవుతుందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. కాజీపేట యూనిట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలుమరింత మెరుగవుతాయని రైల్వే వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# దేశానికే ఆదర్శంగా 'ఫ్యూచర్ సిటీ'

- స్కిల్ యూనివర్సిటీ, ఎఫ్‌సీడీఏ భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా అత్యాధునిక హంగులతో నగర నిర్మాణం
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- పొంగులేటి, శ్రీధర్ బాబు ఆదేశం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న 'ఫ్యూచర్ సిటీ' దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీ పరిధిలో శరవేగంగా నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనంతో పాటు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులను మంత్రులు క్షేత్రస్థాయిలో ఆకస్మాత్తుగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, వేగం పెంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాబోయే తరాల అవసరాలను, భవిష్యత్ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక ప్రపంచస్థాయి మౌలిక వసతులతో



తీర్చిదిద్దుతోందని స్పష్టం చేశారు. ఈ నగరంలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీ.. రాష్ట్ర యువతకు ఉన్నత విద్య, అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాభివృద్ధి మరియు భారీగా ఉపాధి అవకాశాల కల్పనకు ప్రధాన కేంద్రంగా నిలవబోతోందని చెప్పారు. అలాగే, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా నగర మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులకు మరింత పరిపాలనా వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించేది లేదని, ప్రతి పనిలోనూ అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను, కాంట్రాక్ట్ సంస్థలను మంత్రులు ఆదేశించారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై అధికారులకు పలు కీలక మార్గనిర్దేశాలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ మెగా ప్రాజెక్ట్ పనులను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. ఆధునిక హంగులతో నిర్మితమవుతున్న ఈ ఫ్యూచర్ సిటీ భవిష్యత్తులో భారతదేశానికే తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు.





## తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

### నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్



(మొదటి పేజీ తర్వాత..) ఎన్టీఆర్ అభిమానులకు చేతులెత్తి అభివాదం చేస్తూ కాసేపు అక్కడ గడిపారు. ఆయన రాకతో జయంతి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ సంతరించుకుంది. అభిమానుల రద్దీ దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత, ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, ప్రముఖులు ఘాట్ వద్దకు చేరుకుని పుష్పాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో నారా భువనేశ్వరి, నందమూరి రామకృష్ణ మరియు ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. అలాగే సీనియర్ రాజకీయ నాయకులు నాగం జనార్దన్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, పెద్దిరెడ్డి, మండవ వెంకటేశ్వరరావు తదితరులు ఎన్టీఆర్ స్మృత్యంజలిలో పాల్గొని అంజలి ఘటించారు. ఆయన ఆశయ సాధన కోసమే ప్రతి ఏటా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ 103వ జయంతి పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పల్లె పల్లెనా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పలు చోట్ల పేదలకు అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అన్నగారిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సవాల్‌కు కట్టుబడండి

- మంత్రి పొంగులేటి ఛాలెంజ్‌పై కేటీఆర్ ప్రతిసవాల్
- డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిన ఘనత మాది
- రెండున్నరేళ్లలో నగరంలో కట్టినవి ఎన్ని? పడగొట్టినవి ఎన్ని?

శ్వేతపత్రం విడుదల చేయాలి

(మొదటి పేజీ తర్వాత..) రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిన తర్వాతే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి.. ఆ మాట మీద నిలబెట్టుకునే దమ్ముందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ప్రగల్భాలు పలకడం, శపథాలు చేయడం కాదు.. చేతనైతే క్షేత్రస్థాయిలో ఇళ్లు కట్టి చూపించాలని డిమాండ్ చేశారు. "20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే ఓట్లు అడుగుతాం" అనే సవాల్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కేటీఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ మహానగరంలో పేదల కోసం ఏకంగా లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని కేటీఆర్ గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో రూ. 70 వేలతో అగ్గిపెట్టె లాంటి ఇళ్లను కట్టించారని ఎద్దేవా చేశారు. తాము నిర్మించిన ఒక్కో డబుల్ బెడ్‌రూం ఇల్లు.. కాంగ్రెస్ ఇచ్చే ఏడు ఇందిరమ్మ ఇళ్లతో సమానమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వీకెండ్ వస్తే చాలు పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చివేస్తూ ఈ ప్రభుత్వ పెద్దలు వికృతానందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. "గడిచిన కాలంలో ఈ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా కట్టిన ఇళ్లు ఎన్ని? హైడ్రా పేరుతో పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా?" అని కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని ప్రగల్భాలు పలికినా, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇంకెన్ని డైవర్షన్ డ్రామాలు ఆడినా.. ఎన్నికల్లో ఇచ్చిన '420 హామీల' మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల రాద్ధాంతం

- రాజకీయ లబ్ది కోసమే కావాలని యాగి చేస్తున్న నేతలు
- చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం
- సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

(మొదటి పేజీ తర్వాత..)ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తుందని మరోమారు భరోసా ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వర్షాలకు తడిసిన 9,214 టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేసి, బాయిల్డ్ రైస్ మిల్లులకు విజయవంతంగా తరలించినట్లు మంత్రి వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతులకు నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన తాజా గణాంకాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాకు వివరించారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల టన్నుల ధాన్యం రాగా, అందులో 57 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ఇప్పటికే కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన ధాన్యంలో 44.67 లక్షల టన్నులు దొడ్డు రకాలు కాగా, 12.33 లక్షల టన్నులు సన్న రకాల ధాన్యం ఉంది. ధాన్యం అమ్మిన రైతులకు ఇప్పటివరకు రూ. 10,097 కోట్ల నిరంతర చెల్లింపులు జరిగాయని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 8.15 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని రైస్ మిల్లులకు అత్యంత వేగంగా తరలించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, ప్రస్తుతం ఇసుక రవాణాకు ఉపయోగించే లారీలను కూడా తాత్కాలికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మళ్లించినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, మే 28, 2026

# ఐకేపీ, సివిల్ సప్లై అధికారుల జాడ ఎక్కడ..?

- కొనుగోలు కేంద్రాల వైపు చూడని వైనం
- ఎమ్మెల్యే ఆదేశించినా స్పందించని అధికారులు



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం ఉప్పరపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభమై రోజులు గడుస్తున్నా.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారింది. కేంద్రం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు నాలుగు లారీల వరి ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు తరలించారు. అయితే, కొనుగోళ్లు ప్రారంభమై ఇంతకాలమవుతున్నా ఐకేపీ, సివిల్ సప్లై అధికారులు కనీసం కల్లాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

### ఎమ్మెల్యే చెప్పినా నో రెస్పాన్స్..

తమ ఇబ్బందులపై ఉప్పరపల్లి రైతులు స్థానిక ఎమ్మెల్యేను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే స్వయంగా ఆదేశించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో అధికారులు కదలకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కల్లాల నుండి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలను ఏర్పాటు చేయడంలో కూడా ఐకేపీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. స్థానిక నాయకుడు బుజ్జా అమరేందర్ రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని కృషి చేయడం వల్లే కనీసం ఆ నాలుగు లారీలు కూడా గ్రామానికి వచ్చాయని రైతులు పేర్కొంటున్నారు. ఉప్పరపల్లి రైతులపై అధికారులకు ఎందుకింత నిర్లక్ష్యమని వారు ప్రశ్నిస్తున్నారు.

### తరుగు పేరిట దోపిడీ?

ధాన్యం లారీల కేటాయింపు విషయంలో ఏ ఒక్క రైస్ మిల్లు యజమాని కూడా తమ సొంత లారీలను ఉప్పరపల్లి గ్రామానికి పంపించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని రైతులు నిలదీస్తున్నారు. ఉప్పరపల్లి రైతులపై మిల్లుల యాజమాన్యాలు సవతి ప్రేమ చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, వరి ధాన్యం కొనుగోళ్లలో 'తరుగు' తీయవద్దని స్థానిక ఎమ్మెల్యే రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, మిల్లుల యజమానులు మాత్రం తరుగు పేరిట రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నారు.



### కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం శూన్యం

మిల్లుల యాజమాన్యాలు, అధికారులు కుమ్మక్కై తమను నిలువునా ముంచుతున్నారని రైతులు వాపోతున్నారు. తరుగు దోపిడీపై గ్రామ రైతులందరూ కలిసి జిల్లా కలెక్టర్‌కు, సివిల్ సప్లై డీఎం (డిస్ట్రిక్ట్ మేనేజర్) కు స్వయంగా వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ఉన్నతాధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. అధికారుల తీరు చూస్తుంటే వారికి రైతులపై ఎంత 'ప్రేమ' ఉందో అర్థమవుతోందని అన్నదాతలు వ్యంగ్యంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఉప్పరపల్లి కొనుగోలు కేంద్రానికి తగినన్ని లారీలు కేటాయించాలని, తరుగు దోపిడీని అరికట్టి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# త్యాగానికి నిదర్శనం బక్రీద్ పండుగ

**ఎమ్మెల్యే వంశీకృష్ణ 'బక్రీద్' శుభాకాంక్షలు**



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** త్యాగానికి నిదర్శనమైన బక్రీద్ పండుగను పురస్కరించుకుని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ముస్లిం సోదరులకు హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరుల ప్రత్యేక నమాజ్ అనంతరం.. ఆయన ఐఎన్‌టీయూసీ తాలూకా అధ్యక్షుడు మహబూబ్ అలీ నివాసానికి చేరుకున్నారు. అక్కడ మహబూబ్ అలీ కుటుంబ సభ్యులకు, స్థానిక ముస్లింలకు ఎమ్మెల్యే బక్రీద్ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి, కరుణకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆ అల్లాను స్మరిస్తూ, ఆయన చూపిన శాంతి, కరుణ, సోదరభావం అనే అడుగుజాడలలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, అచ్చంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుచ్చి రాములు, వంగూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, ఉమామహేశ్వర టెంపుల్ చైర్మన్ మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రముఖ నాయకులు లాలు యాదవ్, సుంకరి బాలరాజ్, ఉమామహేశ్వర్ డైరెక్టర్ పవన్ కుమార్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు మౌలానా, యూత్ కాంగ్రెస్ నాయకుడు నరసింహ నాయక్ పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

- ఈద్గాలో ప్లకార్డులతో ముస్లిం మత పెద్దల డిమాండ్
- బక్రీద్ వేడుకల్లో గోవులను బలి ఇవ్వవద్దని వినతి



**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బక్రీద్ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా, శాంతియుత వాతావరణంలో జరిగాయి. పట్టణంలోని స్థానిక ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశంలో శాంతిసౌభాగ్యాలు విలసిల్లాలని, అందరూ సోదరభావంతో మెలగాలని ఈ సందర్భంగా దువా చేశారు. ఈద్గాలో ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లిం మత పెద్దలు, యువకులు ఒక ప్రత్యేకమైన డిమాండ్‌తో ముందుకు వచ్చారు. "ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి" అని రాసి ఉన్న ప్లకార్డులను చేతబూని ఈద్గా ప్రాంగణంలో ప్రదర్శించారు. జాతీయ పక్షిగా నెమలిని గుర్తించిన విధంగానే, గోవును కూడా దేశ జాతీయ జంతువుగా అధికారికంగా ప్రకటించాలని వారు కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఆవుల పేరిట జరుగుతున్న దాడులు, ఘర్షణల నేపథ్యంలో ముస్లిం సమాజం ఈ కీలక నిర్ణయం తీసుకుందని మత పెద్దలు పేర్కొన్నారు. ఈ బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఎవరు కూడా గోవులను బలి ఇవ్వవద్దని, ఇతరుల సెంటిమెంట్లను గౌరవిస్తూ పండుగను జరుపుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గంగా-జమునా తెహజీబ్ సంస్కృతికి ప్రతీకగా నిలిచే మన దేశంలో అన్ని మతాల ఆచారాలను, నమ్మకాలను గౌరవించుకుంటూ శాంతియుతంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ముస్లిం పెద్దలు తీసుకున్న ఈ నిర్ణయం పట్టణంలో సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

# పినరాయ్ విజయన్ ఇంటిపై ఈడీ దాడులు దుర్మార్గం

- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సీపీఎం ఆగ్రహం
- అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో నిరసన

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేరళ ముఖ్యమంత్రి, సీపీఎం అగ్రనేత కామ్రేడ్ పినరాయ్ విజయన్ నివాసంపై ఈడీ జరిపిన దాడులను సీపీఎం అచ్చంపేట మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ దాడులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దాడులకు నిరసనగా గురువారం అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం శ్రేణులు భారీ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ దేశ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఈడీ దాడులు చేయడం అన్యాయమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే కేంద్ర దర్యాప్తు సంస్థలను అస్త్రాలుగా వాడుకుంటోందని మండిపడ్డారు. ఇలాంటి బెదిరింపులకు




సీపీఎం భయపడబోదని, ప్రజాస్వామ్య పద్ధతిలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఎం అచ్చంపేట మండల కార్యదర్శి వర్దం సైదులు, మండల నాయకులు మహేందర్, వీరయ్య, రవి నాయక్, లాలు, రాజు, అలాగే సీఐటీయూ నాయకులు గోపాల్, వెంకటయ్య, ఆంజనేయులు, భూపాల్ తదితర పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేష్ గౌడ్‌కు సన్మానం

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రేణుకా మాత గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఆత్మ కమిటీ డైరెక్టర్ జగిత్యాలసురేష్ గౌడ్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ద్వారా ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన సురేష్ గౌడ్‌కు గౌడ సంఘం భవనంలో పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రేణుకా మాత గౌడ సంఘం అధ్యక్షులు బత్తిని ఎల్లగౌడ్ మాట్లాడుతూ.. తమ సంఘ సభ్యుడైన జగిరి సురేష్ గౌడ్‌కు ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రేణుకా మాత గౌడ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో సురేష్ గౌడ్ మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని, సామాజిక వర్గ అభ్యున్నతికి, రైతాంగ సమస్యల



పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో రేణుకా మాత గౌడ సంఘం నాయకులు వికృతి అంజయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సార నర్సయ్య గౌడ్, బాలసాని తిరుపతి గౌడ్, పంజాల వెంకటేశ్వర్లు గౌడ్, గణేష్, గౌడ సంఘం ప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణకు చల్లని కబురు

- మరో రెండు రోజుల్లో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు
- రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు
- వాతావరణ కేంద్రం వెల్లడి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గత కొన్ని రోజులుగా కురుస్తున్న తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ అత్యంత చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు దేశంలో చురుగ్గా కదులుతూ, మరో రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఈ రుతుపవనాల ఆగమనంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. రుతుపవనాల రాకతో ఎండల తీవ్రత తగ్గి, రాష్ట్రవ్యాప్తంగా ఉపశమనం లభించనుంది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు, రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత పెరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించి, వర్షాలు పడే వరకు ప్రజలు ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తీవ్రమైన ఎండల దృష్ట్యా ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ కేంద్రం అధికారులు విజ్ఞప్తి చేశారు.

# తడిసిన వరి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

- రైతులకు నష్టం కలుగొద్దు
- పారదర్శకంగా కొనుగోళ్లు జరగాలి
- మిల్లుల వద్ద లారీలు ఆగకుండా చర్యలు తీసుకోండి
- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రైతులు పండించిన ప్రతి గింజకు సరైన ధర దక్కేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. రైతులు ధాన్యం అమ్మకానికి వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

### మిల్లులలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

గురువారం అచ్చంపేట మండలం



పరిధిలోని చెన్నారం గ్రామంలో గల లలిత ఉమామహేశ్వర కాటన్ జిన్నింగ్ మిల్‌తో పాటు నడింపల్లి గ్రామంలోని వెంకటేశ్వర కాటన్ మిల్లులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మిల్లులలో నిల్వ ఉంచిన వరి, మొక్కజొన్న ధాన్యం బస్తాలను పరిశీలించిన ఆయన.. నిల్వ సామర్థ్యం, ఓపీఎంఎస్ నమోదు, ట్రక్ షీట్లు, లోడింగ్, అన్‌లోడింగ్, మిల్లింగ్ వ్యవస్థపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మిల్లుల వద్ద లారీలు గంటల తరబడి ఆగకుండా, అన్‌లోడింగ్ ప్రక్రియ వేగంగా జరిగేలా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..

ధాన్యం నిల్వలో నిర్లక్ష్యం వహిస్తే నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, వర్షాల నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా తూకం ప్రక్రియను రవాణాను వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దశలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని హెచ్చరించారు.

### రైతులతో ముఖాముఖి..

ఈ పర్యటనలో భాగంగా కలెక్టర్ పలువురు రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు, రవాణా, చెల్లింపుల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు కూడా తగిన నాణ్యత ప్రమాణాలతో ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. అధికారులు రైతుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జిల్లాలో ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో అచ్చంపేట తహసీల్దార్ సైదులు, సంబంధిత శాఖల అధికారులు, మిల్లుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు

### కరపత్రాల ఆవిష్కరణ



**రఘునాథపల్లి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రెక్కాడితే గానీ డొక్కాడని హమాలీ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా పట్టించుకోవడం లేదని హమాలీ సంఘం జిల్లా అధ్యక్షులు బైరగోని బాలయ్య తీవ్రంగా విమర్శించారు. జనగామ జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్న ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో బుధవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట గడ్డ, అనేక ప్రజా ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన జనగామ పట్టణంలో ఈ రాష్ట్ర మహాసభలు జరగడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ సభలకు రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరవుతున్నారని, కార్మికులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నా హమాలీ కార్మికుల బతుకులు మారడం లేదని బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం అధిక బరువులు మోయడం వల్ల కార్మికులు యుక్త వయసులోనే సత్తువ కోల్పోయి, తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుంటే.. మరికొందరు కాళ్లు, చేతులు విరిగి మంచానికే పరిమితమై జీవచ్ఛవాలుగా మారుతున్నారని వాపోయారు. వృద్ధాప్యంలో ఎలాంటి ఆదరణ, సామాజిక భద్రత లేక అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ 4వ మహాసభలో భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోనున్నట్లు బాలయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెంటనే 'వెల్ఫేర్ బోర్డు' ఏర్పాటు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి. 50 ఏళ్లు నిండిన ప్రతి హమాలీ కార్మికుడికి నెలకు రూ. 6,000 పెన్షన్ ఇవ్వాలి. 60 ఏళ్లు దాటిన వృద్ధ కార్మికులకు సామాజిక భద్రత చట్టం ద్వారా నెలకు రూ. 9,000 అందించాలి. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. కార్మికులందరికీ ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఇండ్లు లేని హమాలీలకు 'ఇందిరమ్మ ఇండ్లు' మంజూరు చేయాలి. కార్మికులకు అండగా నిలిచేందుకు ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఈనెల 30న జరిగే మహాసభను అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు షాడా వెంకటయ్య, ద్యావర రమేష్, వెంకట్ నర్సు, పరశురాములు, యాదగిరి, దశరథ, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# జనగామ జిల్లా సర్పంచుల సంఘం కన్వీనర్‌గా గోపగోని శ్రీధర్ గౌడ్

**జనగామ, వాయిస్ ఆఫ్ వంద భారత్ :** తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ పంచాయతీ సర్పంచుల సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. జనగామ జిల్లా నర్మెట గ్రామ సర్పంచ్ గోపగోని శ్రీధర్ గౌడ్‌ను జనగామ జిల్లా సర్పంచుల సంఘం కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి ఆయన నియామకాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజల పూర్తి ఆమోదంతో, నమ్మకంతో ఎన్నికైన సర్పంచులందరూ నిరంతరం చైతన్యవంతులై ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. జనగామ జిల్లా కన్వీనర్‌గా ఎన్నికైన గోపగోని శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనతో పాటు ఏకగ్రీవంగా ఎన్నికైన ఇతర జిల్లాల కన్వీనర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్పంచులందరం రాజకీయ పార్టీలకు అతీతంగా, పూర్తి సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి గ్రామాలకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా రావలసిన నిధులను, సంక్షేమ పథకాలను సాధించుకుని, ప్రజలకు చేరవేస్తూ జనగామ జిల్లాలోని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తానని భరోసా ఇచ్చారు. ఈ అభినందన కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు జనగామ జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

